క్లుప్తంగా

'సాహిత్య అష్టావధానం' కరపత్రాల ఆవిష్కరణ



జడ్చర్ల టౌన్: కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం పురస్కరించుకుని చంద్రశేఖర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సాహిత్య అష్టావధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు శివకుమార్ తెలియజేశారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం చంద్ర గార్డెన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, భాషాభిమానులకు ఉపయుక్తంగా ఉండేలా అష్టావధానం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి హాజరవుతారని, హన్మకొండ వాస్తవ్యులు, అవధాని చేపూరి శ్రీరాం వృచ్ఛకులుగా వ్యవహరిస్తారని, అనుసంధానకర్తగా వరంగల్ వాస్తవ్యులు కంది శంకరయ్య రానున్నారని తెలిపారు. కరపత్రం ఆవిష్కరణలో లయన్స్‌క్లబ్, ఆత్మీయ మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సీసీఆర్‌టీ శిక్షణకు ఎంపిక



రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలంలోని నేరళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ప్రఫుల్ల చంద్ర జాతీయస్థాయి సీసీఆర్‌టీ శిక్షణకు ఎంపికైనట్లు ఎంఈఓ శంకర్ తెలిపారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ.. ప్రఫుల్లచంద్ర మే నెలలో నిర్వహించిన జిల్లాస్థాయి బెస్ట్ ప్రా క్టీసెస్‌లో జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బెస్ట్ ప్రాక్టీసెస్ ప్రజెంటేషన్ చేసి ప్రశంసలు పొందాడు. ఈనెల 10నుంచి 24 వరకు 15రోజులు జరిగే ఈ శిక్షణా తరగతుల కు ప్రఫుల్లచంద్ర ఎంపిక కావడంపై డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మండలస్థాయి క్రీడలు ప్రారంభం



దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండల స్థాయి క్రీడలు ప్రారంభించారు. 69వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ అండర్–14, అండర్–17 బాల, బాలికలకు మండల స్థాయి క్రీడలను నిర్వహించారు. మండలంలోని 10 జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అధికారులు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగేంద్రమ్మ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మదన్‌మోహన్, సుధాకర్‌రెడ్డి, బుచ్చారెడ్డి, చంద్రశేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, గౌరిశంకర్, వేణుగోపాల్, రామకృష్ణారెడ్డి, వెంకటయ్య, సుదర్శన్, చందుగౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి పవిత్రమైంది



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అన్ని వృత్తులలో న్యాయవాద వృతి పవిత్రమైందని మాజీ మంత్రి, ప్రముఖ న్యాయవాది పాడపాటి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక తన నివాసంలో మాజీ మంత్రి న్యాయవాద వృత్తికి చేసిన సేవలకు కీర్తిస్తూ హైకోర్టు న్యాయ్యవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై అభిమానంతో సన్మానం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం హైకోర్టు న్యాయవాది మురళీమోహన్ మాట్లాడుతూ.. చంద్రశేఖర్, న్యాయ రంగంలో ఎన్నో దశాబ్దాలు ప్రజల కోసం పోరాటం చేశారన్నారు. ఆయా న్యావాదులకు ఎల్లప్పుడు ప్రేరణంగా నిలుస్తారన్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారంలో చూపిన చిత్తశుద్ధి ఆయన విశిష్టతకు నిదర్శనమన్నారు. ఒక్క న్యాయరంగంలోనే కాకుండా సామాజిక రంగంలోనూ విశిష్టమైన సేవలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు ఉమాపతి, శ్రీకర్ శర్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు జడ్చర్లకు కేటీఆర్

జడ్చర్ల: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జడ్చర్లకు విచ్చేస్తున్నట్లు మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాజీపేట మండలం ఆవంచలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆవంచలో శ్వేత విగ్రహావిష్కరణ అనంతరం జడ్చర్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగే శ్వేత వర్ధంతికి హాజరవుతారని పేర్కొన్నారు. కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి తదితర మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు తెలిపారు.



బాలానగర్ సింగిల్ విండో కార్యాలయం వద్ద క్యూలో నిలబడ్డ రైతులు



దేవరకద్ర పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు



కావేరమ్మపేట ఆగ్రో రైతు సేవా కేంద్రం ఎదుట బారులుదీరిన రైతులు

క్యూలైన్లు.. పడిగాపులు.. తోపులాటలు

- యూరియా కోసం అన్నదాతల అవస్థలు
- తెల్లవారుజాము 3గంటల నుంచి పడిగాపులు
- చాలీచాలని యూరియా పంపిణీతో విసిగిన రైతన్న
- ఎఫ్‌ఏసీఎస్ కార్యాలయంలోకి చొరబాటు
- అడ్డుకున్న పోలీసులతో రైతుల తోపులాటలు
- చించోలి హైవేపై 2గంటల పాటు బైఠాయింపు



హన్వాడలో చించోలి జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు



మిడ్జిల్ మండల కేంద్రంలో నిరీక్షిస్తున్న రైతులు

హన్వాడ/భూత్పూర్/రాజాపూర్(బాలానగర్)/దేవరకద్ర/మిడ్జిల్/చిన్నచింతకుంట/ జడ్చర్ల/మహమ్మదాబాద్/గండేడ్/అడ్డాకుల: నవాబుపేట : బంగారం దొరుకుతుంది.. కాని యూరియా దొరకడం కష్టమైందని అన్నదాతలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చేతికందిన పంటలకు యూరియా చల్లకపోతే దిగుబడి వచ్చేదెలా.. అదను దాటుతోంది.. ఇంకెప్పుడు ఇస్తారంటూ రైతులు ఆగ్రహించిపోతున్నారు. వేలకువేలు పెట్టు బడిపెట్టి పంటలకు యూరియా చల్లలేకపోతున్నాం.. ఈరోజు ఎలాగైనా యూరియా తీసుకు పోవాల్సిందేనని మరికొందరు రైతులు తెల్లవారుజామున 3గంటలకు వచ్చి క్యూలైన్‌లో నిల్చున్నారు. ఇలా వచ్చిన వారందరికీ యూరియా లేదని ఒక్కమాట చెప్పేసరికి కట్టలు తెగిన ఆగ్రహంతో అన్నదాతలు ఊగిపోయి.. ఎఫ్‌ఏసీఎస్ గేట్లకు అడ్డంగా ఉన్న పోలీసులను తోసుకుంటూ ఒక్కసారిగా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. క్యూలైన్ కోసం కట్టెలతో నిర్మించిన బారికేట్లను విరగ్గొట్టి ఆగ్రహంతో చించోలి జాతీయ రహదారిపై చేరి ఆందోళనకు దిగారు. రోడ్డుకు అడ్డంగా రాళ్లు పేర్చి యూరియా ఇచ్చే వరకు కదిలేదిలేదని రైతులంతా ఒక్కసారిగా ఏకమైన ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ యూరియా ఇచ్చే వరకు కదలమని భీష్మించుకోవడంతో రెండు గంటలపాటు ఉద్రిత్క పరిస్థితి నెలకొంది. పోలీసులు ఎంత సముదాయించినా పట్టించుకోలేదు. చివరకు వచ్చిన వారందరికీ తప్పకుండా యూరియా ఇప్పిస్తామని భరోసా ఇవ్వడంతో అన్నదాతలు శాంతించి తమ ఆందోళన విరమించారు. ఇదంతా సోమవారం హన్వాడ మండలకేంద్రంలోని ఎఫ్‌ఏసీఎస్ ప్రాంగణంలో చోటుచేసుకుంది. అధికారులు వెంటనే స్పందించి మండలానికి సరిపడా యూరియాను పంపిణీ చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

- భూత్పూర్ సింగిల్ విండో, రైతు ఆగ్రో సేవా కేంద్రం వద్ద సోమవారం రైతులు ఉదయం 6గంటల నుంచి గుమిగూడారు. మండలంలో 20వేల బస్తాల యూరియా సరఫరా చేశా మని వ్యవసాయాధికారి మురళీధర్ అన్నారు.

- బాలానగర్ మండలంలోని సింగల్‌విండో కార్యాలయానికి రెండు లారీల యూరియా వస్తే సోమవారం ఉదయం నుంచే రైతులు యూరియా బస్తాల కోసం పీఏసీఎస్ ఎదుట పడిగాపులు కాశారు. చివరికి వ్యవసాయశాఖ అధికారులు, పోలీసుల మధ్య ఒక్కో వ్యక్తికి ఒక్క యూరియా బస్తాను ఇచ్చి పంపారు.

దేవరకద్రలో ఉరుకులు పరుగులు

- దేవరకద్ర కోయిల్‌సాగర్ రోడ్డులో టోకెన్లు ఇస్తారంటే అక్కడికి పరుగులు, తీరా అక్కడి వెళ్లాకా పీఏసీఎస్ వద్ద ఇస్తామంటే మళ్లీ ఉరుకులు పరుగులు.. తెల్లవారకముందే రైతులు రోడ్లపై తిరుగుతూ కనిపిస్తున్నారు. వచ్చిన రైతులకు వ్యవసాయ అధికారులు, పోలీసులు ఒక దగ్గర టోకెన్లు ఇచ్చారు. ఒకరిపై ఒకరు తోసుకుని పోతేనే టోకెన దొరికే పరిస్థితి. ఇక యూరియా ఇచ్చేచోట మరో పెద్ద లైన్. అక్కడ ముసలి ముతక, చిన్నాపెద్ద లెక్కచేయకుండా తోసుకుపోతేనే యూరియా బస్తా దొరుకుతుంది. దేవరకద్రలో సోమవారం కనిపించిన పరిస్థితి ఇది. ఒక లారీ యూరియా ఆగ్రో సెంటర్‌కు వస్తే టోకెన్లు జారీ చేసి రైతులకు అందజేశారు. అలాగే పీఏసీఎస్‌కు మరో మూడు లారీల యూరియా వస్తే రైతులకు ముందుగా టోకెన్లను జారీ చేశారు. ఆ తరువాత మరోచోట యూరి యా బస్తాలను పంపిణీ చేశారు. అయితే వేయిమందికి పైగా వచ్చిన రైతులు ఒకరినొకరు తోసుకున్నారు. పోలీసులు వారిని క్యూలైన్‌లో నిలబెట్టడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. మరో లారీ యూరియా ప్రైవేట్ డీలర్లకు రావడంతో అధికారులు అక్కడికి వెళ్లి యూరియా పంపిణీ చేశారు.

- మిడ్జిల్: మండలంలో యూరియా కష్టాలు రైతులకు రోజురోజు ఎక్కువయ్యాయి. సోమవారం పీఏసీఎస్‌కు రెండు లారీల యూరియా రాగా ఉదయం నుంచి రైతులు క్యూ లైన్‌లో నిరీక్షించారు. రైతుకు రెండు బస్తాల యూరియా ఇచ్చారు. లైన్‌లో ఉన్న దాదాపు 30శాతం మంది రైతులకు యూరియా అందలేదు. వారికి టోకెన్లు ఇచ్చారు. రేపు వస్తే మొదట టోకెన్లు ఇచ్చిన వారికి సరఫరా చేసిన తర్వాత కొత్తవారికి ఇస్తామని కార్యదర్శి బాల్‌రెడ్డి తెలిపారు.

- చిన్నచింతకుంట: మండలంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం–1, 2 కౌకుంట్ల మండలం అప్పంపల్లి పీఏసీఎస్ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఉందయం నుంచే పడిగాపులు కాశారు. ప్రతి కేంద్రానికి 300 బస్తాలు రావడంతో అధికారులు పోలీస్ బందోబస్తుతో యూరియాను పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున ఇచారు.

- జడ్చర్ల: జడ్చర్లలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. రెండుమూడు రోజులుగా ఎదురు చూసిన రైతాంగం సోమవారం యూరియా వస్తుందని తెలుసుకుని సంబంధిత ఎరువుల దుకాణాల ఎదుటబారులుదీరారు. ఆగ్రో ఫార్మ ఎరువుల దుకాణాల వద్ద ఒక్కో రైతుకు ఆధార్ కార్డు ద్వారా రెండు బస్తాల యూరియాను పంపిణీ చేశారు. కాగా, తమకు మరికొంత యూరియా అవసరం ఉందని, పాలకులు, అధికారులు స్పందించి తమకు కావాల్సిన యూరియాను సరఫరా చేయాలని కోరారు.

చించోలి–మహబూబ్‌నగర్ హైవేపై ధర్నా

- మహమ్మదాబాద్: సోమవారం ఉదయం 4గంటల నుంచి యూరియా కోసం పడిగాపులు గాసిన రైతులు యూరియా రాకపోవడంతో రోడ్డెక్కారు. ఉదయం 6గంటల నుంచే వెంకట్‌రెడ్డిపల్లి గేట్ వద్ద దాదాపు రెండు గంటలపాటు ధర్నాకు దిగారు. మరో వైపు నంచర్లగేట్‌లో పడిగాపులు గాసిన రైతులు నంచర్ల క్రాస్ రోడ్డు వద్ద ధర్నా చేశారు. గంటల తరబడి రైతులు రోడ్డుపై భీష్మించుకూర్చోవడంతో రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచి ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడాల్సి వచ్చింది. నిత్యం మండలానికి యూరియా వస్తున్నా.. ఎంత మేరకు సరిపోతున్నదని అధికారులు అంచనా వేయలేకపోతున్నారు. చివరకు సాయంత్రం రెండు లారీల యూరియా రావడంతో కొంతమంది రైతులకు పంపిణీ చేశారు.

యూరియా పంపిణీ పరిశీలన

- గండేడ్: మండల వ్యాప్తంగా రైతులకు ఏర్పడిన యూరియా కొరత కారణంగా ఆదివారం రైతులు ధర్నా రాస్తారోకో చేసి తీవ్ర ఆందోళనలు చేపట్టారు. దీంతో సోమవారం గండేడ్ మండల వ్యాప్తంగా పలు ఎరువుల దుకాణాల్లో తహసీల్దార్ మల్లికార్జున్ పరిశీలించారు. రైతులకు యూరియా ఎలా పంపిణీ చేస్తున్నారని డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తగా పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

- అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లో యూరియా కోసం సోమవారం రైతులు బారులుదీరారు. అడ్డాకుల సింగల్ విండో వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు వరుస కట్టారు. మూసాపేటలో ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువుల కోసం రైతులు ఉదయం నుంచే చెప్పులను వరుసలో పెట్టి బారులుదీరారు. ఏఓ అనిల్ కుమార్ రైతులకు టోకెన్లు జారీ చేసి యూరియా పంపిణీ చేశారు. అడ్డాకుల సింగిల్ విండో వద్ద స్టాక్ ఉన్నంత వరకు పంపిణీ చేశారు.

- నవాబుపేట: యూరియా కోసం ఎక్కడ చూసిన క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ తోపాటు కొల్లూర్, చౌడూర్‌లో అందుబాటులో ఉంచారు. మండల కేంద్రంలో రైతులు ఒక రోజుముందు రాత్రి వచ్చి జాగారం చేస్తే వారికి యూరియా దక్కింది. కాగా పీఏసీఎస్‌తోపాటు కొల్లూర్ ఆగ్రో కేంద్రంలో అందుబాటులో ఉండడంతో రైతులు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. చౌడూర్‌లో రైతులు ఎగబడ్డారు. చివరికి ఒకే బస్తా అందించారు. కొల్లూర్, చౌడూర్‌లో రెండు బస్తాలు అందించారు.



హన్వాడ ఎఫ్‌ఏసీఎస్‌లో బారులుదీరిన మహిళా రైతులు



మూసాపేటలో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు



అప్పంపల్లి పీఏసీఎస్ వద్ద వేచి ఉన్న రైతులు



అడ్డాకుల సింగిల్ విండో వద్ద బారులుదీరిన రైతులు

రైతులు ఆందోళన చెందొద్దు

గండేడ్: యూరియా కొరత ఉన్నప్పటికీ మండలంలోని రైతులకు సరిపడా అందుబాటులో ఉందని తహసీల్దార్ మల్లికార్జున్ అన్నారు. సోమవారం మండలంలోని శ్రీలక్ష్మి ఏజెన్సీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులందరికీ కావాల్సినంత యూరియా వస్తుందని ఆందోళన చెందవద్దన్నారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ మా ట్లాడుతూ.. రైతులు సమన్వయం పాటించాలని, ప్రతిరైతుకు అందించే బాధ్యత ప్రభుత్వానిదన్నారు.

ఇసుక టిప్పర్‌కు జరిమానా

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి సమీపంలో దుందుభీ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పరును పోలీసులు పట్టుకోని కేసు నమోదు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించడంతో తహసీల్దార్ రాజు టిప్పరుకు రూ.50వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

మైసమ్మ లడ్డు వేలం రూ.20లక్షలు

నవాబుపేట: మండలంలోని మైసమ్మ ఆలయంలో ప్రసాదాల విక్రయాలకు సంబంధించి సోమవారం టెండర్లు నిర్వహించినట్లు మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ అధికారి నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా కాకర్లపహాడ్‌కు చెందిన కంఠం నరేశ్ రూ.20,44000 వేలకు లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయానికి టెండర్ దక్కించుకున్నట్లు వివరించారు. కాగా, గతేడాది రూ.18లక్షలు పలికిన ప్రసాదాల విక్రయం తాజాగా రూ.20లక్షలు దాటింది. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్‌లు గోపాల్, కృష్ణయ్య, నరేందర్, వెంకటయ్య, నరేశ్, మాదవ్, బాలయ్య, ఆలయ సిబ్బది గోపాల్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం

నవాబుపేట: ఇంటి దగ్గర టైలర్ పని చేసుకుంటూ ఉండే యువతి అకస్మాత్తుగా అదృశ్యమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన చాకలి సింధూజ(18) ఆదివారం ఇంటి వద్ద ఎవరూలేని సమయంలో కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదు. గ్రామానికి చెందిన గడ్డమీది మహేశ్‌పై అనుమానం ఉందని యువతి తల్లి చాకలి వసంత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కేసు నమోదు చేసి ఆరా తీస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పబ్లిక్ మరుగుదొడ్లు నిర్మించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లయిన అంబేద్కర్ చౌరస్తా, తెలంగాణ చౌరస్తాలతోపాటు ఇతర రద్దీ ప్రాంతాల్లో పబ్లిక్ మరుగుదొడ్లను నిర్మించాలని శ్రీలక్ష్మీ నారాయణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఆనందకుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వేతనాల పెంపుపై నాన్‌టీచింగ్ సిబ్బంది హర్షం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో నాన్‌టీచింగ్ సిబ్బందికి 12శాతం వేతనాలను పెంచడంపై నాన్‌టీచింగ్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వేతనాల పెంపునకు కృషి చేసిన వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబును కలిసి సిబ్బందికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ.. కొన్ని ఏళ్లుగా సిబ్బంది చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ క్రమంలో ప్రస్తుత వీసీ ప్రయత్నాలతో వేతనాలు పెంచడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాగే ఈఎస్‌ఐ సదుపాయం అమలు చేసే విధంగా వీసీ చర్యలు తీసుకున్నారన్నారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఏం సాధించారని విజయోత్సవ సభ?'



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఏం సాధించిందని ఈ నెల 15న కామారెడ్డిలో బీసీల విజయోత్సవ సభకు ఏర్పాటు చేస్తున్నారని బీసీ సమాజ్ రా ష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్య క్షుడు శ్రీనివాస్‌సాగర్ ప్రశ్నించారు. బీసీ సమాజ్ జిల్లా కార్యాలయంలో సోమవా రం ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి, స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించి, నేడు కాలయాపన చేస్తూ, కోర్టుల్లో నిలబడని జీవోలు ఇచ్చి, మరో సారి బీసీలను మోసగించేందుకు కాంగ్రెస్ ప్రభు త్వం ప్రయత్నించడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే విజయోత్సవ సభ నిర్వహించాలన్నారు.

రోడ్డు మరమ్మతు చేయించండి

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ నుంచి ఎక్వాయపల్లి వరకు రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారినందున వెంటనే మరమ్మతులు చేయించాలని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల వర్షాలకు రోడ్డు పూర్తిగా పాడయ్యిందని ఆయన దృష్టికి తీసుకొచ్చా రు. రోడ్డు బాగు చేయించేందుకు చర్యలు చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు రమేశ్, మోహన్‌నాయక్, శంకర్‌నాయక్, మహేశ్ పాల్గొన్నారు.

ఈశ్రమ కార్డు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

భూత్పూర్: భవన నిర్మాణ, ఇతర కార్మికులుగా పనిచేస్తున్న వారు ఈ–శ్రమ కార్డులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేబర్ కార్డును కలిగి ఉండాలని జిల్లా లేబర్ ఆఫీసర్ బాసిత్ అన్నారు. సోమవారం అమిస్తాపూర్‌లో తెలంగాణ లేబర్ డిపార్ట్‌మెంట్, ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భవన, ఇతర నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్, సిబ్బంది అంజద్, స్రవంతి, శ్రీదేవి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పూర్తి చేయాలి

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానంలో అసంపూర్తి నిర్మాణంతో ఉన్న కల్యాణ మండపం పనులు పూర్తి చేయాలని సోమవారం దేవాదాయ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఈవో కోమల్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు అంజన్‌కుమార్‌రెడ్డి, ఆదిహన్మంత్‌రెడ్డి, నర్వశ్రీనివాస్‌రెడ్డి, రాంపాండు, దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు హైదరాబాద్‌లో డిప్యూటీ కమిషనర్ వినోద్‌ను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం ఇచ్చారు.

దివ్యాంగులకు పింఛను పెంచాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేల పింఛను పెంచాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బిక్షపతి మాదిగ డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచుతామని హామీ ఏమైందని ప్రశ్నించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్‌మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని 7వ వార్డు పరిధిలోని పంచముఖ కాలనిలో నెలకున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలని వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, కరెంటు లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ షాపు లేక ప్రజలు అనేక సమస్యలు ఎదురుకుంటున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మైక్రో బ్రూవరీలను నిలిపివేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ పట్టణం కార్పొరేషన్‌గా మారుతున్న సందర్భంలో మైక్రోబ్రూవరీల పేరుతో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఆపేయాలని ఎస్‌ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పద్మావతి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సురవరం వెంకట్రామిరెడ్డి భవన్‌లో మాట్లాడారు. పబ్ కల్చర్‌ను చిన్నచిన్న నగరాలకు విస్తరించి ప్రభుత్వం డబ్బులు దండుకోవాలని చూస్తుందని ఆరోపించారు. టీస్టాళ్ల మాదిరి బీర్ల విక్రయాలు, తయారీ కేంద్రాలు ఏర్పాటు చేస్తే పేద కుటుంబాలు రోడ్డునపడే ప్రమాదముందన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్ఐడబ్ల్యూ అధ్యక్షురాలు భార్గవి, పట్టణ కార్యదర్శి ఇందిర, మహేశ్వరి, సత్యమ్మ, అంజమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రెండు బస్తాలు ఇవ్వాలి



మహబూబ్‌నగర్ రూరల్: రైతులకు ఎకరానికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేయాల ని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బోయపల్లి రోడ్డు హాకా కేంద్రంలో యూరియా పంపిణీని పరిశీలించి రైతులతో మాట్లాడారు. యూరి యా కోసం రైతులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్‌లో ఉన్నారని, వారికి తాగునీరు అందించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. అదేవిధంగా రైతులకు సరిపడా యూరియాను తెప్పించుకోవాలని, ఇంతకుముందు రైతులు ఆధార్ కార్డుపై యూరియా పంపిణీ చేసిన విధంగా పట్టాదారు పాస్ పుస్తకం కావాలని తిప్పించుకోకుండా యూరి యా పంపిణీ చేయాలన్నారు. మాజీ మంత్రి వెంట ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న ఉన్నారు.

కాంగ్రెస్ నేతలకు ఊరట

పాలమూరు: దివిటిపల్లి డబుల్ బెడ్‌రూంలు అర్హులైన అభ్యర్థులకు ఇవ్వాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆందోళన చేసిన కాంగ్రెస్ నేతలపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. సదరు కేసు సోమవారం మూడో అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి తప్పుడు కేసుగా పేర్కొంటూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ఉన్నవారిలో కాంగ్రెస్ నేతలు ఎన్.పీ వెంకటేశ్, లక్ష్మణ్‌యాదవ్, బెక్కరి అనిత, సాయిబాబ, ఫయాజ్, రాములు, చంద్రశేఖర్ ఉన్నారు.

పనిభారం పెంచే యాప్‌ను రద్దు చేయాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఎం ఉద్యోగులకు తలకు మించిన తీవ్రమైన పనిభారాన్ని పెంచుతున్న ఎన్సీడీ, యూడబ్ల్యూఎన్, ఎంసీహెచ్ వంటి ఆన్‌లైన్ యాప్‌లను తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంతకాలంగా రిపోర్టులను ఆన్‌లైన్‌లో పంపించాలని రెండు యాప్‌లతో అలవాటు చేసి ప్రస్తుతం 14రకాల యాప్‌లను తెచ్చారని పేర్కొన్నారు. ఈ యాప్‌లు అర్ధరాత్రి పనిచేస్తాయని, ఆ సమయంలో ఎలా పని చేయాలని ప్రశ్నిస్తున్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయమ్మ, నాయకులు పాల్గొన్నారు.